సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 30 । మే । 2023



దిశ.. కొత్త దశ
దిశ పోలీస్‌స్టేషన్‌లతో కొత్త దశ మొదలైంది. చిన్నారులు, మహిళల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. -8లో



అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్ట్
తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ, నగదు, నగలు అపహరిస్తున్న అంతర్ జిల్లాల దొంగ కావడి సోమశేఖర్ (26)ను మదనపల్లె పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 805 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	295	412
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 263.68 కిలోలు

నవశకం..ప్రగతి వికాసం

- నవరత్నాలతో పేద ప్రజల జీవితాలను మారుస్తున్న ప్రభుత్వం
- అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు
- అన్నదాతకు అండగా జగన్ సర్కార్
- అతివలకు ఆసరాగా నిలుస్తున్న ప్రభుత్వం
- నేటితో వైఎస్ జగన్ సర్కార్‌కు నాలుగేళ్లు పూర్తి



సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో ఒకే సముదాయంలో రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, గ్రామ సచివాలయం

సాక్షి రాయచోటి : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు వెళుతున్న వైఎస్సార్ సీపీ సర్కార్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. వెనుకబడిన వర్గాలకు ఆర్థిక భరోసా ఇస్తూ..ఆడపడుచులకు అండగా నిలుస్తూ..అన్నదాతకు వెన్నుదన్నుగా...యువత ఉపాధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తనకంటూ చెరగని ముద్ర వేసుకుంటోంది. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారపగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తోంది.మేనిఫెస్టోలో చెప్పినవి..చెప్పనవి కూడా అమలు చేస్తూ పేద ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వృద్ధులు, రైతులు, చిన్నారులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు ఇలా ప్రతి వర్గానికి ప్రభుత్వం ఆపన్నహస్తాన్ని అందిస్తోంది. రాజన్న రాజ్యంలో జగనన్న సంక్షేమాన్ని ప్రత్యేకంగా చెప్పకనే చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజల్లో పూర్తి చైతన్యం తీసుకొచ్చింది. అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయాల వద్దకు పరుగులు తీయకుండా సంబంధిత ప్రభుత్వ సిబ్బందే ప్రజల వద్దకు వచ్చేలా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ చిరస్థాయిగా నిలిచిపోతోంది. ఇలా ఒకటేమిటీ చెబుతూ పోతే అనేక రకాలుగా ప్రజలకు ప్రభుత్వం ద్వారా సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి మంగళవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

అన్నమయ్య జిల్లాలో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కళ్లకు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా సచివాలయ వ్యవస్థతో పొద్దున లేచింది మొదలు ప్రజల ముంగిట్లో అధికారులు సేవలు అందిస్తున్నారు. జిల్లాలో 501 సచివాలయాలు ఉండగా అందులో 8861 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 414 సచివాలయాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 87 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 4421 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఎక్కడికక్కడ నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు కావాల్సిన పనులు చేసి పెడతుండగా...సచివాలయ ఉద్యోగులు కూడా అనుకున్న గడువులో పల ప్రజల సమస్యలు తీరుస్తూ గ్రామ స్వరాజ్య దిశగా అడుగులు వేస్తూ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా పనిచేస్తున్నారు. 2019 అక్టోబరు 2న గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాందిపలికారు.

మహిళలకు వైఎస్సార్ ఆసరా

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డ్వాక్రా మహిళలకు సంబంధించి అప్పు ఉన్న ప్రతి రూపాయిని అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు విడతల్లో చెల్లిస్తానని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే విడతల వారీగా మహిళలకు సొమ్ము అందజేస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు అన్నమయ్య జిల్లాలో ఉన్న 27,214 గ్రూపులకుగాను 2,16,048 మంది సభ్యులు ఉండగా, వారికి ఇప్పటివరకు మూడు విడతల్లో రూ. 530 కోట్లు చెల్లించారు. అలాగే వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 79157 మందికి రూ. 450 కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం మహిళలకు అందించి చేయూతనిచ్చింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి కూడా ఇప్పటివరకు రూ. 160.89 కోట్లు చెల్లించారు. అంతేకాకుండా మహిళలకు అనేక పథకాల ద్వారా ప్రయోజనాన్ని ఒనగూరుస్తున్నారు.

ఆటోవాలాలకు అండగా

అన్నమయ్య జిల్లాలో ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రతిరోజు కష్టపడుతున్న వారికి కొంతమేర ఆదుకోవాలన్న సదుద్దేశంతో ఒక్కో ఆటో కార్మికునికి వాహనమిత్ర పథకం కింద రూ. 10 వేలు అందిస్తోంది. అందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు మూడు విడతల్లో సుమారు 10500 మందికి పైగా రూ. 20 కోట్లకు పైగా ఆర్థికసాయం అందించారు.

గూడులేని పేదలకు పక్కా ఇల్లు

అన్నమయ్య జిల్లాలో పేదలందరికీ ఇల్లు కట్టించే బృహత్తర పథకానికి ప్రభుత్వం నాంది పలికింది. జిల్లాలో 73,069 మందికి 526 లే అవుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 200 కోట్లకు పైగా జమ చేసింది. కాలనీలలో రూ. 1361 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. 79621 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికే 21 వేల గృహాలు పూర్తయి వడంతో గృహ ప్రవేశాలు నిర్వహించారు. లబ్ధిదారులకు బిల్లుల రూపంలోనూ సుమారు రూ. 5.13 కోట్లకు పైగా ప్రభుత్వం అందజేసింది.

పండుటాకులకు అండలం

జిల్లాలో ఉన్న పండుటాకులను రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్‌భరోసా ద్వారా ఆర్థికంగా ఆదుకుంటోంది. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, కళాకారులు, కల్లుగీత కార్మికులు ఇలా జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,18,101 మందికి సంబంధించి రూ. 60.16 కోట్లకు పైగా ప్రతినెల అందజేస్తూ వస్తోంది. తెల్లవారకముందే మొదలయ్యే పెన్షన్ల పంపిణీ ఒకటి, రెండు రోజుల్లోనే వలంటీర్లు అందరికీ అందజేస్తున్నారు.

మాంగల్య బంధానికి కానుక

వివాహం చేసుకుంటున్న పేద వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పేరుతో నూతన జంటలకు ఈసారి కూడా 349 మందికి రూ. 2.76 కోట్ల మేర నిధులు వారికి అందించారు.

▸▸ పేదల విద్యకు పెద్దపీట

జిల్లాలో విద్యకు సంబంధించి కూడా వైఎస్ జగన్ సర్కార్ పెద్దపీట వేస్తోంది. చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించడంలో అమ్మ ఒడి పథకంలో భాగంగా 42,55,000 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు మూడు విడతల్లో సుమారు రూ.763.20 కోట్లకు పైగా వెచ్చించారు. అలాగే జగనన్న విద్యా కానుక కింద రెండు లక్షల మంది విద్యార్థులకు సంబంధించి రూ. 32.38 కోట్లు, జగనన్న గోరుముద్ద కింద 158500 మందికి రూ. 21.10 కోట్లు ఖర్చు చేశారు. మన బడి నాడు-నేడు కింద 514 పాఠశాలలను ఎంపిక చేసి రూ. 330 కోట్లతో ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మార్చారు. అలాగే వసతి దీవెనతోపాటు పలు సంక్షేమ పథకాల ద్వారా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

▸▸ నేటితో నాలుగేళ్లు పూర్తి

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవ ఘట్టానికి మంగళవారంతో నాలుగు వసంతాలు పూర్తి కానున్నాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో ప్రజల గుండెల్లో నిలిచిన నేతగా గుర్తింపు పొందారు.

▸▸ రైతన్నలకు అండగా...



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచిపోనున్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రతి ఏడాది ఖరీఫ్, రబీలలో సాగుకు ముందే భరోసాను అందిస్తున్నారు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఏడాది రెండు లక్షల మందికి పైగా రైతులకు ఇప్పటివరకు నాలుగేళ్లుగా ఒక్కొక్కరికి రూ. 13,500 చొప్పున రూ. 800 కోట్లకు పైగా అందించారు. పంటల బీమా పథకం ద్వారా కూడా 40 వేల మంది మంది రైతులకు రూ. 60 కోట్లకు పైగా బీమా సొమ్ము అందించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద లక్ష మంది రైతులకు రూ. 54 కోట్లకు పైగా సొమ్ములు అందజేశారు. అలాగే మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా ఆత్మహత్యచేసుకున్న 46 కుటుంబాలకు రూ. 30 కోట్లకు పైగా సొమ్మును అందించారు. ఇలా రైతుకు ప్రతి విషయంలోనూ ప్రభుత్వం భరోసా కల్పిస్తూ వస్తోంది.

సీఎంకు రుణపడి ఉంటాం



భర్తలేదు. ఇద్దరు ఆడపిల్లలు.కూలి పనులకు వెళ్లాలంటే ఆరోగ్యం బాగాలేదు. కుటుంబపోషణ భారంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టకాలంలో కుటుంబ పెద్ద మాదిరిగా మా జీవితాలకు అండగా నిలిచాడు. నాలుగు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా చేయూత 18500 రూపాయలు నా అకౌంట్‌లో జమ అవుతున్నాయి.దీంతో ఇబ్బందులు తొలగాయి. మా కుటుంబం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము.
–**షేక్ జైనాబీ, గృహిణి, ఓబులవారిపల్లె**

నవరత్నాలతో లబ్ధి చేకూరింది



నాపేరు గూండ్ల రామకృష్ణ. సిద్దవటం మండలం మాధవరం-1 పంచాయతీ లోని బంగారుపేట గ్రామం. చేనేత కార్మికుడిని. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరాత్నలతో మా కుటుంబానికి లబ్ధిచేకూరింది.

రైతులకు వరం ఆర్‌బీకేలు



రైతు భరోసా కేంద్రాలు వరం లాంటివి. గతంలో ఎరువుల కోసం అవస్థలు పడాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే రైతుల కోసం ఆర్‌బీకేలు ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుతున్నాయి. మళ్లీ జగనన్నే సీఎం కావాలి. – **యానాదనాయుడు, రైతు, పి కొత్తపల్లి**

సొంతింటి కల నెరవేరింది



గత ప్రభుత్వాల హయాంలో ఇంటిస్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాకు ఇంటి స్థలం మంజూరైంది. ప్రభుత్వమే ఇల్లు నిర్మిస్తోంది. సొంతింటి కల నెరవేరింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – **షేక్ షకీనాబి, రైల్వేకోడూరు**

న్యూస్‌రీల్

విత్తన నాణ్యతపై రాజీ పడొద్దు

రాయచోటిటౌన్ : విత్తనాల నాణ్యతపై రాజీ పడొద్దని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. శేఖర్ బాబు అధికారులకు సూచించారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన కాయలను, ఎరువులను పరిశీలించారు. అనంతర రైతులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాల పంపిణీ జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు.విత్తనాలను మొలకెత్తించి పరిశీలించాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మకు సూచించారు.అనంతరం రైతు భరోసా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ



చిట్లూరు ఆర్‌బీకేలో అధికారులతో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

రామాపురం: మండలంలోని చిట్లూరు రైతు భరోసా కేంద్రాన్ని రాష్ట్ర ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్ బాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేస్తామన్నారు. వేరుశనగ కాయల నాణ్యత ప్రమాణాలను,మొలక శాతంను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా విత్తన ఏపీ సీడ్స్ ఎండీ జగదీష్, మండల వ్యవసాయాధికారి నాగమణి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

కడప రూరల్: జిల్లాలో ప్రథమ చికిత్సా కేంద్రాలు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని నిబంధనలు విధించారు. ఆర్‌ఎంపీలు తమ పేరుకు ముందు డాక్టర్ అని రాయకూడదు. బోర్డ్‌లో క్లినిక్ లేదా హస్పిటల్ అని రాయకుడదు, ప్రథమ చికిత్సా కేంద్రం అని మాత్రమే రాయాలి. బెడ్స్ ఉండకూడదు. అడ్మిషన్స్ చేయకూడదు. ఇంజక్షన్, ఐవీ ఫ్లూయిడ్స్, స్టెరైడ్ మందులు వేయకూడదు. . ఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ తెలిపారు.

చేనేతలకు ఊపిరి పోసిన వైఎస్ జగన్

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నష్టాల్లో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం ఆప్కో కార్యాలయంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల చేనేత సహకార సంఘ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఆప్కో చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. సొసైటీలను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు చేనేతలు నేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసేలా అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. 2022 డిసెంబరు 31 వరకు సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నామని తెలిపారు. నిల్వ ఉన్న స్టాక్‌ను 100 శాతం కొనుగోలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను ఎండీ దృష్టికి తీసుకెళ్లి క్లియర్ చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం కాలం చెల్లిన స్టాక్‌పై 66 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. జూన్ 1వ తేది నుంచి దాన్ని 75 శాతానికి పెంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆప్కో డైరెక్టర్లు అవ్వారు యల్లా సుబ్బరాయుడు, ఉదయగిరి వెంకటేశ్, చేనేత విభాగం డైరెక్టర్ లక్ష్మీదేవి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల చేనేత జౌళిశాఖ ఏడీలు బీమయ్య, శ్రీనివాసులురెడ్డి, ఆప్కో డీఎంఓ వరప్రసాద్, అభివృద్ధి అధికారి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకే మొదటి ప్రాధాన్యత




ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి: ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 55 వినతులను ఎస్పీకి అందజేశారు. సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

మాట నిలబెట్టుకున్న చరిత్ర చంద్రబాబుకు లేదు

- టీడీపీ మేనిఫెస్టోలో అన్నీ అబద్ధాలే
- వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : ఆల్ ఫ్రీ బాబుగా పేరొందిన చంద్రబాబుకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చరిత్ర లేదని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం రాయచోటిలో ఎమ్మెల్యే పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాజీ సీఎం విడుదల చేసిన మేనిఫెస్టోలో అన్నీ అబద్ధాలేనని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఏయే మ్యానిఫెస్టోను ఎంత శాతం అమలు చేశానని ఏనాడైనా సమీక్ష చేసుకున్నారా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోను తీసుకుంటే 650 వాగ్దానాలలో కనీసం 10 శాతం అమలు చేసిన చరిత్ర ఆయనకు లేదన్నారు. తమ మ్యానిఫెస్టో ఇంటింటికి పంపిన చరిత్ర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని, అయితే టీడీపీ మ్యానిఫెస్టోను కేవలం పది నిమిషాలు మాత్రమే ఆన్‌లైన్‌లో పెట్టి వెంటనే తొలగించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. మరి అలాంటి పార్టీ నాయకుడు మ్యానిఫెస్టోను విడుదల చేస్తే క్రెడిబిలిటీ ఉంటుందా అన్నారు. తాను 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏం చేశాను అన్నది చెప్పుకోలేని ఈ నాయకుడు నేడు మరోమారు వాగ్దానాలు చేస్తే ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పూర్ టు రిచ్ అనే కార్యక్రమం బాబుకు తన 75 ఏళ్ల వయసులో రాజకీయ జీవన సంధ్య వేళలో గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు. పేదలను ధనికుల్ని చేసిన చరిత్ర చంద్రబాబుకు ఏనాడూ లేదన్నారు. పేదరికం నుంచి బయటపడుతున్న అక్కాచెల్లెమ్మలను, రైతులను రుణమాఫీ వాగ్దానంతో 2014-19 మధ్య మరింత నిరుపేదలుగా మార్చారన్నారు.

అధికారం వస్తే కదా?

అధికారం రాదన్న అభిప్రాయంతోనే ఆర్టీసీ బస్సులన్నింటిలో ఉచిత ప్రయాణం, మూడు సిలిండర్లు అంటూ గాలం వేస్తున్నారన్నారు. 45 ఏళ్ల అనుభవం అని చెప్పుకుంటున్న చంద్రబాబు ఒక కాపీ క్యాట్ అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ పథకాలన్నీ కాపీ కొట్టాడని, ఇప్పటికే సోషల్ మీడియా నిరూపిస్తోందన్నారు. 18 ఏళ్ల వయసు నుంచి 59 వరకు నెలకు రూ.1500 అంటూ వాగ్దానం చేస్తున్నానంటూ.. ఇప్పుడు వాగ్దానం చేయడం ఏమిటన్నారు. 2014-19 మధ్య ఇలాంటి ఏస్కీమ్ అయినా చేశారా అని ప్రశ్నించారు. అసలు డ్వాక్రా రుణమాఫీ మొదట సంతకం అన్న వాగ్దానమే అమలు చేయని పార్టీని ఎవరు నమ్ముతారన్నారు. తల్లికి వందనం అంటూ అమ్మఒడిని కాపీ కొట్టారన్నారు.

క్లుప్తంగా

ఫోరం ఫర్ సోషల్ కన్వీనర్‌గా నరసింహులు



రాజంపేట : ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ కన్వీనరుగా అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన న్యాయవాది కేఎంఎల్ నరసింహులు ఎన్నిక య్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం ఇక్కడి విలేకరులకు తెలియచేశారు. బీహార్ రాష్ట్ర మైన పాట్నాలో ఆదివారం 29 రాష్ట్రాల సమావేశంలో దక్షిణ భారతదేశం నుంచి కేఎంఎల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడా పాఠశాల ప్రవేశాలు ప్రారంభం

రాయచోటి టౌన్ : కడపలోని వైఎస్సార్ జిల్లా క్రీడా పాఠశాలలో 2023–2024 సంవత్సరానికి గానూ 4, 5వ తరగతిలో చేరేందుకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా స్టెప్ / డీఎస్‌ఏ సిజ సాయిగ్రేస్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మండల స్థాయిలో జూన్ 15 నుంచి 20వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో జూన్ 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి ఎంపిక జూన్ 29, 30 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉంటుందని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ అన్నమయ్య జిల్లా క్రీడా చీఫ్ కోచ్ షఫీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వివాహితపై దాడి

మదనపల్లె : తన ఇంటిలో చోరీ విషయమై నిందిస్తున్న ఓ వివాహితపై కొందరు దాడి చేసి గాయపరచిన సంఘటన మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన వెంకటాద్రి భార్య ప్రేమకుమారి (36) ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. ఈ విషయమై ఆమె ఎదురింటి వారిని అనుమానిస్తూ నిలదీసింది. దీంతో ఆగ్రహించిన ఎదురింటిలో నివాసముండే రెడ్డెమ్మ, ఆమె భర్త జయచంద్రలు ప్రేమకుమారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితురాలు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిశ.. కొత్త దశ

- భార్యాభర్తల కలతలను దూరం చేస్తున్న పోలీసులు
- విడిపోతున్న కాపురాలను నిలబెడుతున్న వైనం
- విడతల వారిగా కౌన్సెలింగ్

దిశ పోలీస్‌స్టేషన్లతో కొత్త దశ మొదలైంది. చిన్నారులు, మహిళల సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఇవి ఎన్నో సమస్యలు పరిష్కరిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ముఖ్యంగా ఆడపిల్లల కాపురాలను చక్కదిద్దుతున్నాయి.





భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారుల బృందం

కడప 'దిశ' పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలు

సంవత్సరం	జనరల్ ఫిర్యాదులు	ట్రిపుల్ సీ	పరిష్కారం	ఎఫ్ఐఆర్	పెండింగ్ కేసులు
2020	308	245	535	18	–
2021	926	296	1204	18	–
2022	525	844	1283	83	03
2023	209	325	423	93	18

కడప అర్బన్ : సమాజంలో భార్యాభర్తల అన్యోన్యతతో కుటుంబ అభివృద్ధి, తద్వారా పిల్లల శ్రేయస్సు, వారి ద్వారా సమాజాభివృద్ధి సుసాధ్యమవుతుంది. వారి మధ్య కలతలు కాపురంలో చిచ్చు రేపుతున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయికి వచ్చిన వారు తాము చేస్తున్న వ్యాపారాలు, ఉద్యోగాల 'బిజీ లైఫ్'తో తమ పిల్లల బాగోగులను పట్టించుకునే స్థితిలో వుండరు. దీంతో పిల్లలు శారీరక పెరుగుదల, ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధిస్తున్నారు. కానీ తమ దైనందిన జీవితంలో తల్లిదండ్రులు, పెద్దలు, గురువులను ఎలా గౌరవించాలి. తాను జీవితాంతం తోడు నీడగా వుండాల్సిన భార్య, భర్త స్థానాలు ఎలా వుండాలి? అనే విధానాలపై 'మానసిక పరిపక్వత' చెందక అవగాహన రాహిత్యంతో 'సంసార జీవితాల'ను దూరం చేసుకుంటున్నారు. పూర్వకాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు వుండేవి. అవ్వా,తాతలు తమ పిల్లలకు, మనువలు, మనువరాళ్లకు మంచి, చెడ్డా, కుటుంబ జీవన విధానం, సమాజంలో మెలిగే పద్ధతులను నేర్పించేవారు. రానురాను ఆ విధానంలో వచ్చిన మార్పులతో చిన్నచిన్న కుటుంబాలుగా విడిపోయి, జీవన విధానాలను నగరజీవితాలుగా మార్చుకుని భర్త, భార్య, పిల్లలుగా మారిపోయి ఆర్థికంగా మెరుగుపడాలనే తాపత్రయంలో పడిపోయారు. కాలక్రమేణ వారి పిల్లల కార్పొరేట్ చదువులపై వున్న శ్రద్ధ, వారి క్రమశిక్షణతో జీవితాన్ని సాగించేలా చూడాలనే విధానం సన్నగిల్లిపోయింది. అంతేగాక ఆడ,మగ పిల్లలను చిన్నతనం నుంచే వారికి ఇచ్చే స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో పెరిగి పెద్దవాళ్లయిన తరువాత కూడా అదే విధానం అవలంబించడం వల్ల జీవితగమనంలో విభేదాలు తలెత్తుతున్నాయి.

సమస్యల చుట్టూ పరిభ్రమిస్తున్న జీవితాలు

- ఆధునిక సాంకేతికతతో 'సెల్‌ఫోన్' లేకుండా చిన్న పిల్లాడి నుంచి పెద్దల వరకు వుండలేకపోతున్నారు. 'సెల్‌ఫోన్' దైనందిన జీవితంలో భాగమవడంతోపాటు, వ్యసనంగా మారింది. 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ వారు భార్యాభర్తల మధ్య ఏర్పడుతున్న కలతలకు కారణాలను తెలుసుకుని 'కౌన్సెలింగ్' అనే బ్రహ్మాస్త్రంతో తొలగించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు. ఈ విధానం ద్వారా చాలా కేసుల్లో విజయవంతంగా ముందుకు వెళుతున్నారు.
- 18 ఏళ్ల వయసు రాగానే, పూర్వకముందే కొందరు ఆడపిల్లలు తల్లిదండ్రులను సైతం లెక్క చేయకుండా తాను ప్రేమించిన యువకుడే సర్వస్వం అంటూ ముందుకు వచ్చి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎంత త్వరగా జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నారో, వీరిలో కొందరు అంతే త్వరగా విడిపోవడానికి సిద్ధపడుతున్నారు.
- కొందరు తమ సెల్‌ఫోన్ల ద్వారా ఇంటిలో పడకగది నుంచి స్నానాల గదుల వరకు ఒకరిపై మరొకరు నమ్మకం లేక వీడియోలను తీసుకుంటూ వారి సంసారాన్ని వారే నాశనం చేసుకుంటున్నారు.
- విద్యావంతులైన వారే కొందరు ఆడపిల్లలు తమ వైవాహిక జీవితాన్ని ఆరు నెలలకు గానీ, ఏడాది పూర్వక ముందే భర్త సంసారానికి పనికిరాడని నిర్ణయించుకుంటున్నారు. 'కౌన్సెలింగ్ పీరియడ్' రెండు నెలల కాలం పూర్వక ముందే 'క్షణసాధింపు' ధోరణిలో ప్రవర్తిస్తూ విడిపోతున్నారు.

కడప 'దిశ' పోలీస్ స్టేషన్ ద్వారా అందిస్తున్న సేవలు

- కడప దిశ పోలీస్‌స్టేషన్‌కు నేరుగాగానీ, జిల్లా ఎస్పీ నిర్వహించే 'స్పందన' ద్వారా వచ్చే భార్యాభర్తల, మహిళల, చిన్నపిల్లల సమస్యలు, నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను డీఎస్పీ స్థాయి అధికారి దృష్టికి వస్తాయి. ఆయన ఆదేశాల మేరకు మొదట బాధితుల సమస్యలను తెలుసుకుంటారు. భార్యాభర్తల మధ్య ప్రాథమికంగా మనస్పర్థలను తొలగించేందుకు ఇక్కడి సిబ్బంది ప్రయత్నిస్తారు. లేదంటే మొదటి రెండు నెలలు 'కూలింగ్ పీరియడ్'లో మూడు లేదా ఐదు కౌన్సెలింగ్‌లను నిర్వహించి వారి మధ్య విభేదాలను తొలగించి సజావుగా కాపురం చేసుకునేలా ప్రయత్నిస్తారు. కలువలేని పరిస్థితుల్లో వారి ఇష్ట ప్రకారం ఎఫ్.ఐ.ఆర్‌లను తమ పరిధిలో గానీ, ఆయా పోలీస్‌స్టేషన్ల ద్వారా నమోదు చేయిస్తారు. తరువాత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఈ కౌన్సెలింగ్‌లను ప్రతి మంగళవారం, శనివారం నిర్వహిస్తారు. ఈ కౌన్సెలింగ్‌కు భార్యాభర్తలను విడివిడిగా పోలీసు అధికారి, మనస్తత్వశాస్త్ర నిపుణులు, న్యాయవాదులు, ఎన్జీఓ సంఘానికి చెందిన సభ్యుల సమక్షంలో విచారణ చేస్తారు. తరువాత ఇద్దరిని కలిపి విచారణ చేసి విడిపోతే కష్ట,నష్టాలు, కలిసుంటే జీవితాంతం సంసారం సాఫీగా సాగుతుందని 'పోస్ట్ మేరిటల్ కౌన్సెలింగ్' విధానం ద్వారా వివరిస్తారు. గతంలో ప్రతి మంగళవారం, శనివారం కౌన్సెలింగ్‌ను ఐదు జంటలలోపు నిర్వహించేవారు. ప్రస్తుతం 10 నుంచి 15 జంటలకు నిర్వహించాల్సి వస్తోంది.
- కొందరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు తమ ఆడపిల్లలకు తక్కువ వయసులోనే వివాహం చేస్తుంటారు. వారికి వైవాహిక జీవితంపై అవగాహన వుండదు. అలాంటి జంటలకు కౌన్సెలింగ్ ద్వారా వారి మధ్య మనస్పర్థలు తొలగించి, వారిని ఒక్కటిగా చేసి పంపిస్తున్నారు.
- ఉద్యోగం వుంటే ఆర్థిక స్వేచ్ఛ కలిగి వుంటుందని కొందరు మహిళలు గానీ, పురుషులుగానీ వివాహేతర సంబంధాలు, రెండో వివాహంపై మొగ్గు చూపుతూ సంసారాన్ని నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వారిలో కొందరిని కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా కలుపుతున్నారు. కొందరు ఎన్ని కౌన్సెలింగ్‌లు నిర్వహించినా అవగాహన రాహిత్యంతో దూరంగానే వుంటున్నారు.

మచ్చుకుకొన్ని..

- పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాక తన భర్త సంసారానికి పనికిరాడని తెలుసుకుని తల్లిదండ్రులకు చెప్పలేక తనలోనే కుమిలిపోయి నరకం అనుభవించింది. డబ్బుల కోసం తన భర్త మరో వివాహానికి సిద్ధపడితే పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు వాస్తవాలను విచారణ చేసి వారు విడిపోతేనే మంచిదని భావించారు.
- తనను ప్రేమించిన సమయంలో ఫొటోలు తీసుకున్న యువతిని, వేరే వివాహం చేసుకున్న తరువాత ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోలుగా మార్చి 'బ్లాక్ మెయిలింగ్'కు పాల్పడిన ఓ యువకుడిని పిలిపించి, సదరు న్యూడ్ ఫొటోలను తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేశారు.
- ఓ తొమ్మిదినెలల పసిబాబును, భార్యను మనస్పర్థలతో దూరం చేసుకున్న భర్తను ఒకేఒక్క కౌన్సెలింగ్ ద్వారా వారిని కలిపి పంపించారు.
- కొందరు భర్తలు మద్యం, ఇతర చెడు వ్యసనాలకు బానిసలుగా మారి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం, అవసరమైతే 'డీ అడిక్షన్' సెంటర్‌లకు పంపించి వారిని కలిపేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నారు.

కౌన్సెలింగ్ ద్వారానే మనస్పర్థలకు చెక్



భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాలను తొలగించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నాం. ప్రతి మంగళ, శనివారాలలో 'కౌన్సెలింగ్'ను నిర్వహించి వారి మధ్య అభిప్రాయ భేదాలను తొలగించి న్యాయం జరిగేలా చూస్తున్నాం. మహిళలు, చిన్నారుల పట్ల జరిగే నేరాల నియంత్రణకు అహర్నిశలు పనిచేస్తున్నాం. 'దిశ' యాప్‌ను జిల్లా వ్యాప్తంగా మహిళల చేత డౌన్‌లోడ్ చేయించాం. ఆపద సమయాలలో ఆదుకుంటున్నాం. – ఎస్.రమాకాంత్, కడప 'దిశ' డీఎస్పీ

పిడుగుపాటుతో పాడి ఆవు మృతి

కేవీపల్లె : పిడుగుపాటుకు పాడిఆవు మృతి చెందిన సంఘటన ఎర్రజేనుపల్లెలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఎర్రజేనుపల్లెకు చెందిన గౌస్‌పీర్ తన పాడి ఆవును ఇంటి సమీపంలో పందిరికింద కట్టి వుంచాడు. అయితే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. ఇదే సమయంలో పిడుగుపడడంతో పాడి ఆవు మృతి చెందింది. అలాగే పక్కనే ఉన్న గడ్డివాము కాలిపోయింది. మొత్తం రూ. 60 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్ట్

- రూ.9 లక్షల నగలు స్వాధీనం
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- చిత్తూరు, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

మదనపల్లె : తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ, నగదు, నగలు అపహరిస్తున్న అంతర్ జిల్లా దొంగ కావడి సోమశేఖర్ (26)ను మదనపల్లె టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.9 లక్షల విలువైన 156.7 గ్రాముల బంగారు, వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఇటీవల మదనపల్లె డివిజన్‌లో పలు చోరీ కేసులు నమోదు కావడంతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగా ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి పట్టణంలోని చౌడేశ్వరీదేవి సర్కిల్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. మదనపల్లె పట్టణం చీకిలుగుట్ట గౌతమీనగర్‌కు చెందిన కావడి సోమశేఖర్‌గా గుర్తించి విచారించగా నిందితుడు అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి జిల్లాల్లో 2014 నుంచి ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అతని వద్ద నుంచి 77.5 గ్రాముల బంగారు నగలు, 245 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేకాకుండా విచారణలో భాగంగా మదనపల్లె పట్టణం రామారావుకాలనీకి చెందిన సాయికిరణ్, అతని భార్య శేషాబాయి, ఆమె చెల్లులు దేవదానమ్మలతో కలిసి చోరీ సొత్తును వారి పేరుతో పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన మూడు రసీదులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి ఆధారంగా ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి మరో 79.2 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు సాయికిరణ్, శేషాబాయి, దేవదానమ్మలతో కలిసి ఫైనాన్స్ కంపెనీలో నగలు తాకట్టు పెట్టిన అనంతరం వచ్చిన సొమ్మును వాటాలుగా పంచుకునే వారని తెలిపారు. చోరీ సొత్తును పంచుకున్న సాయికిరణ్, శేషాబాయి, దేవదానమ్మలపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సాయికిరణ్ ఇప్పటికే సారా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నాడని, పిటీవారెంట్ ద్వారా అతన్ని విచారణకు తీసుకుంటామన్నారు. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుడిపై పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, తాలూకా పోలీస్‌స్టేషన్‌లో రెండు, పీలేరు, వాల్మీకిపురం, కలికిరి, సత్యసాయిజిల్లా కదిరి, చిత్తూరు జిల్లా కల్లూరు తదితర పోలీస్‌స్టేషన్లలో 15 చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు. నిందితునిపై నాన్‌బెయిలబుల్‌వారెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలియజేశారు. నిందితుడు తెలివిగా చోరీ చేయాల్సిన ఇళ్లను ముందుగానే ఎంపిక చేసుకుని రెక్కీ నిర్వహించేవాడని, ఆయా ప్రాంతాల్లో పోలీసుల కదలికలపై నిఘా ఉంచేవాడని తెలిపారు. ప్రస్తుతం ఏడు కేసుల్లో నిందితునిగా పేర్కొంటూ సోమశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకువెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంయస్‌ను సద్వినియోగం చేసుకుని పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విలువైన వస్తువులు, నగదు లాకర్లలో భద్రపరచుకోవాలని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ లోకేష్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, మునిరత్నం, రెడ్డిప్రసాద్, భద్రనాయక్, రెడ్డిశేఖర్‌లను పోలీస్ రివార్డుకు సిపార్సు చేస్తున్నట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం



నారాయణుడు నాయక్ (ఫైల్)

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఏఎస్ఐ ఆదినారాయణ తెలిపారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన మూడే నారాయణుడు నాయక్ (50) ఈ నెల 26వ తేదీ నుంచి కనిపించలేదం లేదని అతని భార్య అరుణమ్మ ఫిర్యాదు చేశారు. బాధితునికి మతిస్థిమితం సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆచూకీ గుర్తించరూ..



నూర్ అలాం(ఫైల్)

వాల్మీకిపురం : యువకుడు అదృశ్యమైన సంఘటన పట్టణంలోని జెట్టిపాల్యెంవీధిలో చోటు చేసుకొంది. బీహార్‌కు చెందిన సాధత్ తన కుమారుడు నూర్ అలాంతో కలసి కూలి పనుల నిమిత్తం వాల్మీకిపురంలోని జెట్టిపాల్యెం వీధిలో గత కొంత కాలంగా నివాసముంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి దండించడంతో నూర్‌అలాం (18) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తమ కుమారుడి ఆచూకీ గుర్తించాలని సాధత్ ఎస్సై నాగేశ్వర రావుకు ఫిర్యాదు చేశాడు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

రైల్వేకోడూరు : మండలంలోని సూరపురాజుపల్లి రైల్వేబ్రిడ్జి మీద రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే బ్రిడ్జి దగ్గర ఒక పల్సర్ బైక్ ఉందని, ఆ బైక్ వివరాలు చూడగా గంపల నవీన్ తండ్రి ఈశ్వరయ్య అని ఉందని, పూర్తి స్థాయిలో వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

– పలువురికి గాయాలు



వివాదాస్పద స్థలం వద్ద విచారణ చేస్తున్న సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : స్థల వివాదం కారణంగా సోమవారం మదనపల్లె పట్టణం నిమ్మనపల్లె సర్కిల్‌లో ఇరువర్గాలు గొడవపడగా పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు దిగువకమ్మపల్లె వద్ద ఆదినారాయణరెడ్డి మరికొందరితో కలిసి లీలాసాగర్ ఇంటి ముందు ఉన్న అతని బంధువుకి చెందిన ఖాళీ స్థలంలోని రక్షణగోడను కూల్చివేసి రేకుల షెడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో లీలాసాగర్ బంధువుతో కలిసి అడ్డుపడ్డాడు. దీంతో వివాదం ఏర్పడింది. ఆదినారాయణరెడ్డి అనుచరులతో కలిసి దాడి చేసి వీరంగం సృష్టించాడు. స్థానికులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలంలో గుమికూడారు. ఆదినారాయణరెడ్డి వర్గంలోని ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దాడిలో లీలాసాగర్ కుటుంబ సభ్యులు గాయపడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆదినారాయణరెడ్డితోపాటు అతని అనుచరులపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇదే గొడవలో పీటీఎం మండలం చింతవారిపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి, అతని కుటుంబ సభ్యులు మంజులమ్మ, ప్రభావతమ్మలు సైతం గాయపడి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. స్థలంపై తమకు పూర్తి హక్కులు ఉండగా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి తమపై దాడికి పాల్పడ్డారని, ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. తమ స్థలంలో కొంత ఆలయానికి ఇచ్చి మిగిలిన స్థలంలో జీవనోపాధికై షెడ్డు ఏర్పాటు చేసుకుని ఉండగా తమపై అమరేంద్ర, భాస్కర్, శ్రీనాథ్, తదితరులు తమపై దౌర్జన్యం చేశారని, తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే గొడవకు కారణమైన షెడ్డును టూటౌన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ లోకేష్‌రెడ్డి పరిశీలించారు. భూవివాదంలో దౌర్జన్యాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి



మోహన్‌కుమార్ మృతదేహం

ములకలచెరువు : ములకలచెరువుకు చెందిన డిస్కం ఉద్యోగి మోహన్‌కుమార్ (45) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మోహన్‌కుమార్ మదనపల్లిలో కాపురం ఉంటూ రూరల్ మండలం వేంపల్లిలో విద్యుత్ లైన్‌మ్యాన్‌గా పని చేసేవారు. ఈ నేపథ్యంలో ములకలచెరువులో ఉన్న తన తల్లిని చూసి వస్తానని భార్య లలితకు చెప్పి ఆదివారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ములకలచెరువుకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపాళ్యం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం ఉదయం అటు వైపు వెళ్లే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసు విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.